క్లుప్తంగా...

బీహెచ్‌ఈఎల్ హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ నెల 28వ తేదీన జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మేనేజింగ్ కమిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వెంకట్రావ్, ఉపాధ్యక్షులుగా ఎస్.నారాయణ, కార్యదర్శిగా కెవీ.సుబ్బారావు, కోశాధికారిగా ఎం.నీలకంఠరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా చింత రాములు, సి.విద్యాధరిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కాలనీ వాసులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

డిజిటల్ యుగం.. ఉపాధ్యాయులు తప్పనిసరి

రాయదుర్గం: ప్రస్తుత డిజిటల్ యుగంలో తరగతి గదిలో ఉపాధ్యాయుల ఉనికి తప్పనిసరి అని రాజస్థాన్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఫుర్కాన్ కమర్ అన్నారు. మనూలో యూజీసీ–హెచ్‌ఆర్‌డీసీ, మాల్వియా మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో రెండు వారాల రిఫ్రెషర్స్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు డిజిటల్ స్పేస్‌లను కలిగి ఉంటున్నాయని, డిజిటల్ సాధనాలు విద్యకు అనుబంధంగా ఉంటాయయే కానీ ఉపాధ్యాయులను భర్తీ చేయలేవన్నారు. కార్యక్రమంలో యూజీసీ ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా ప్రసంగించారు.

శివాజీనగర్‌లో ఆత్మీయ సమావేశం

శేరిలింగంపల్లి: ఎన్నికల్లో విజయం సాధించి శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్‌లో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన గాంధీ మాట్లాడుతూ ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. ఎస్‌ఆర్‌డీపీలో భాగంగా 10 పనులు చేపడితే వాటిలో 9 పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. అనంతరం శివాజీనగర్ వాసులు గాంధీకి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, కాలనీవాసులు నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, సచిన్ అగర్వాల్, ప్రసాద్, పండరీ, రఘునాథ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా గోల్కొండ ఏరియా ఆస్పత్రి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలందిస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడ అందుతున్నాయి. ఆస్పత్రికి సొంత ఆక్సిజన్ తయారీ ప్లాంట్ ఉండడం దీన్ని ప్రత్యేకత. పది పడకలతో ఐసీయూ వార్డు కూడా ఈ ఆస్పత్రికి అదనపు ఆకర్షణగా ఉంది. ప్రతి నిత్యం వెయ్యి మంది ఔట్ పేషంట్లు వచ్చే ఈ ఆస్పత్రి ఎన్నో ప్రత్యేకతలను చాటుకుంది. ఆస్పత్రి ఇన్ పేషంట్ విభాగం ఎప్పుడు కూడా ఫుల్ ఆక్యూపెన్సీతో ఉంటోంది. ఆస్పత్రికి అన్ని విభాగాల వైద్యులు సర్జన్స్ కూడా ఉన్నారు. దంత విభాగం, ఈఎన్‌టీ, డెర్మటాలజీ విభాగం కూడా ఈ ఆస్పత్రిలో ఉంది. వివిధ రకాల వైద్య సేవలు అందించే ఫిజిషియన్స్, సర్జన్స్, గైనకాలజీస్టులు రోగులకు అందుబాటులో ఉంటారు. ప్రత్యేకంగా ఆర్థోపెడిక్ విభాగం కూడా ఉంది. అత్యాధునిక పరికరాలతో ఎప్పుడు హైజినిక్‌గా ఉండే ఆపరేషన్ థియేటర్ ఈ ఆస్పత్రికే తలమానికంగా ఉంది. మరోవైపు ఆస్పత్రిలో పచ్చని మొక్కలు ఎటు చూసిన కానవస్తుంటాయి. వివిధ రకాల పూల మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఔషధ గుణాల మొక్కలతో పాటు పచ్చని ఎత్తైన చెట్లు రోగులకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. త్వరలోనే ఆస్పత్రిలో రోగుల కోసం కొత్త బ్లాక్‌ను నిర్మించడం జరుగుతుందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. నగరంలోని ఏరియా ఆస్పత్రుల్లో గోల్కొండ ఏరియా ఆస్పత్రి నెంబర్ వన్‌గా కొనసాగుతుంది.

శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలి

జియాగూడ: దీపావళి మరుసటి రోజున పూర్వీకుల సమాధుల వద్ద పూజలు నిర్వహించుకోవడానికి శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలని జియాగూడ మాజీ కార్పొరేటర్ మునేందర్ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీలో వినతి పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జియాగూడలోని గిరికపల్లి, కేశవస్వామినగర్ ఎస్సీ శ్మశానవాటిక, సాయి దుర్గానగర్, దుర్గానగర్, మూసీ పరిసర ప్రాంతాల్లో ఉన్న హిందూ శ్మశానవాటికల్లో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శ్మశానవాటికల్లో ముళ్ల చెట్లను తొలగించడం, ప్రహరీలకు మరమ్మతులు, సమాధులకు సున్నాలు, విద్యుత్‌దీపాల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాటు చేయనున్నారు. 10 ఏళ్ల నుంచి జోనల్ కమిషనర్‌లు శ్రద్ధ వహించడం వల్ల ఏర్పాట్లు జరుగుతున్నాయని గుర్తుచేశారు.

పారిశుద్ధ్య లోపం.. వెదజల్లుతున్న దుర్గంధం

- ప్రధాన రహదారుల పక్కన వ్యర్థాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



దేవాలయ సమీపంలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలు



రోడ్డు పక్కనే పారుతున్న మురుగు

అత్తాపూర్: పారిశుద్ధ్య నిర్వహణ లోపం కారణంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారు. అత్తాపూర్, ఇందిరానగర్ చౌరస్తా నుంచి ముష్కమహల్ రోడ్డు మార్గం ద్వారా రాంబాగ్ వెళ్లే రహదారిలో అమ్మవారి దేవాలయం సమీపంలో కుప్పలు తెప్పలుగా చెత్త చెదారం పేరుకుపోయింది.

- పేరుకుపోయిన వ్యర్థాలు డంపింగ్ యార్డుగా తయారై దుర్గంధం వెదజల్లుతూ.. ఆ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించే వారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక ప్రజలు కార్పొరేటర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుసార్లు కోరినా.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకపోయారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం..

మరోవైపు ఎక్కడికక్కడ చెత్త చెదారం పేరుకుపోవడంతో ప్రజా జీవనానికి ఆటంకం కలుగుతుంది. చెత్తను సేకరించే వారు సకాలంలో రాకపోవడంతో ఎవరికి వారు రోడ్లపైనే నిర్లక్ష్యంగా చెత్తను పారవేస్తున్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అత్తాపూర్ పరిసర ప్రాంతాలు కనిపిస్తున్నాయని పలువురు మండిపడుతున్నారు.

ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి..

- అత్తాపూర్ గ్రామానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి భూగర్భ డ్రైనేజీతో పాటు రోడ్లను ఆధునీకరించాల్సిన అవసరముందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా దూర దృష్టితో ఆలోచన చేసి సుదీర్ఘకాలం మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషి



మాట్లాడుతున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది తమ పూర్తి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర వెల్లడించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లో వార్డు ఆఫీసర్స్, సూపర్‌వైజర్లు, ఆర్‌పీస్, సెక్షన్‌హెడ్స్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, బాత్‌రూమ్స్, వృద్ధులు, వికలాంగుల కోసం వీల్‌ఛైర్స్ సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రజల తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అధికారులు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఒక్కడూ.. !

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న రాజేంద్రనగర్, శంషాబాద్ రెవెన్యూ మండలాలను కలుపుతూ.. నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నాటి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌పై విజయం సాధించారు. అనంతరం 2014లో కాంగ్రెస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌పైనే మరోసారి విజయం సాధించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో విపక్ష పార్టీల కూటమిగా టీడీపీ అభ్యర్థి గణేష్‌గుప్తాకు సీటును కేటాయించారు. దీంతో (ప్రస్తుత బీఆర్‌ఎస్) టీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకాశ్‌గౌడ్ టీడీపీ అభ్యర్థిపై హ్యాట్రిక్ విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రత్యర్థులు ఎవరున్నా.. వారిపై ఎమ్మెల్యే విజయం సాధిస్తూ నియోజకవర్గంలో ఒకే ఒక్కడుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఆయన పోటీలో కొనసాగుతున్నారు.

ఎన్‌సీసీతో దేశ సంస్కృతి అనుసంధానికి ప్రోత్సాహం



ట్రోఫీని అందజేస్తున్న ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ సంజయ్‌సాయల్

శంషాబాద్ రూరల్: ఎన్‌సీసీ కార్యకలాపాలతో దేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక అనుసంధానానికి ప్రోత్సాహం కలుగుతుందని ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ సంజయ్‌సాయల్ అన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంపు ముగింపు వేడుకలను సోమవారం శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ నెల 21 నుంచి జరుగుతున్న ఈ శిబిరం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో పాల్గొన్న కేడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల మధ్య పరస్పర అవగాహనను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ శిబిరంలో భాషాఅభ్యాసం, సంస్కృతి సంప్రదాయాలు, వంటకాలు తదితర రంగాలను అనుసంధానం చేయడానికి దోహదపడుతుందన్నారు. కేడెట్స్‌లకు సైనిక, ఉద్యోగ నైపుణ్య శిక్షణను అందజేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఎన్‌సీసీ గ్రూపు నిర్వహించిన ఈ శిబిరంలో కేడెట్లకు గ్రూపు పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు కల్నల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. క్యాంపు కమాండెంట్ కల్నల్ పీయూష్ శ్రీవాస్తవ, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.మగేంద్రన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన అవినాష్ శర్మ



అబిడ్స్: 100 మీటర్ల ఫ్రీస్టైల్ స్విమ్మింగ్ పోటీలలో అవినాష్ శర్మ మొదటి బహుమతిని పొందారు. ఆరు మాస్టర్ తెలంగాణ స్టేట్ స్విమ్మింగ్ పోటీలలో అవినాష్ శర్మ సత్తాచాటారు. మొదటి బహుమతి పొందిన ఆయనకు సర్టిఫికెట్లు అందజేసి నిర్వాహకులు అభినందించారు.

రోడ్డు స్వీపింగ్‌పై ప్రత్యేక దృష్టి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: రోడ్డు స్వీపింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లోని సౌభాగ్యనగర్ కాలనీ, 3వ డివిజన్‌లోని పెద్దమ్మ గుడి కాలనీ, 5వ డివిజన్‌లోని సాయిరాం ఎన్‌క్లేవ్‌లో స్వీపర్స్ చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెత్తచెదారాలను రోడ్లు, ఇంటి పరిసరాల్లో వేయకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త ఆటో రిక్షా కార్మికులకు అందించాలని ప్రజలకు సూచించారు. అనంతరం సాయిరామ్ ఎన్‌క్లేవ్ కాలనీ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, వెంకటేష్, కృష్ణ, రాము తదితరులున్నారు.

సమిష్టి కృషితో విజయం సాధిస్తా !



రాజేంద్రనగర్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో పర్యటించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాంతవాసులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేస్తున్నామన్నారు. అందరి సమిష్టి కృషితోనే నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నారన్నారు. ఏ ఇంటికెళ్లినా.. ప్రజలు అనేక సమస్యలను తమ ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

మణికొండ: ప్రజల ఆకాంక్షలను గౌరవించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రం బడా నేతలకు కల్పతరువుగా మారిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజల తెలంగాణ వస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన సమక్షంలో అత్తాపూర్, హైదర్‌గూడలకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయనకు మద్దతు ప్రకటించారు. శంషాబాద్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాలకు చెందిన పలువురు నాయకులు ఆయనకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందక వెనుకబడి పోయిందన్నారు. మణికొండ మోడల్‌గా రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని తీర్చి దిద్దేందుకు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా కణిగిరి ఎమ్మెల్యే మధుయాదవ్ కస్తూరి నరేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నరేందర్ సమక్షంలో పార్టీలో చేరిన అత్తాపూర్, హైదర్‌గూడ యువకులు

'మనూ మేరా యువ భారత్' వర్క్‌షాప్

రాయదుర్గం: యువత తమ శక్తిని సద్వినియోగం చేసుకోవాలని ఉర్దూ విశ్వవిద్యాలయం స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో, మనూ నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మనూ మేరా యువభారత్' పేరిట వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ యువతకు శక్తినిస్తుందన్నారు. 21వ శతాబ్దంలో దేశ భవిష్యత్తును రూపొందించడంలో భారత దేశ యువత కీలకపాత్రను పోషిస్తారన్నారు. సాంకేతిక, సామాజిక రంగాల్లో పూర్తి సామర్థ్యాన్ని సాధించేందుకు విద్యపై దృష్టి పెట్టాలని కోరారు. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొ.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ విభజనను తగ్గించడానికి, దేశవ్యాప్తంగా యువతకు సాధికారత కల్పించడానికి డేటా ఆధారిత విధానం అవసరమన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కమరుద్దీన్, డాక్టర్ జరార్ అహ్మద్ ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీన్ ప్రొ.అలీమ్ అష్రఫ్

గాజాపై సైనిక దాడులు అమానుషం



ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా గోల్కొండలో ఈఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో నిరసన

గోల్కొండ: గాజాలో నివసిస్తున్న పాలస్తీనులపై ఇజ్రాయిల్ వైమయానిక బూతల దాడులు చేయడం అమానుషం అని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం గోల్కొండ రిసాల బజార్‌లో గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ దాడులు ఆపాలి, ఇజ్రాయిల్ ఉత్పత్తులను కొనవద్దు అని పోస్టర్లు పట్టుకొని నినాదాలు ఇచ్చారు. అనంతరం మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ఒక్క దేశం స్వాతంత్రం కోరుకుంటుందని, అయితే ఇజ్రాయిల్ మాత్రం పాలస్థీన గాజా పర్వత శ్రేణులపై ఉన్న పాలస్థీన ప్రజల స్వాతంత్రాన్ని వ్యతిరేకిస్తుందని ఆరోపించారు. ముస్లిం ప్రజలతో ఇజ్రాయిల్ కక్షకట్టినట్లు వ్యవహరించడం సరికాదని ఆయన అన్నారు. ప్రపంచ అగ్రదేశాలతో పాటు ప్రధాని మోదీ కూడా ఇజ్రాయిల్ అరాచకాలను అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మహ్మద్ రాహుఫ్, అసద్, మౌలానా, సయ్యద్ ఖాజా తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బండ్లగూడ: బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తామంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నామని చెబుతున్నారని, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో రెండో రోజు వివిధ డివిజన్‌లలో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయలను ఖర్చుచేసి అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన నిధులను సమకూర్చి శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. అభివృద్ధి పనులను ముమ్మరంగా ప్రజలకు వివరిస్తున్నామన్నారు.

జంగ్ 2023 తెలంగాణ

- నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కనీవిని ఎరగని రీతిలో మరోసారి ఎమ్మెల్యే విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.
- బీజేపీ, కాంగ్రెస్‌ల అబద్ధపు హామీలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని, మరోసారి బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు.
- ఎమ్మెల్యే చేసిన పనులను మరచిపోకుండా మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రవేశపెట్టిన పథకాలను, మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు.
- నవంబర్ 30న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మావతిపాపయ్య, అస్లాంబిన్ అబ్దుల్లా, కో- ఆప్షన్ సభ్యులు మలాకీరత్నం, సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, నాగరాజు, పాండు, సయ్యద్‌ఖాజా, అంతారం నరేష్, చేగూరి రాజు, రాంప్రసాద్, రాము, యువజన అధ్యక్షులు మల్లేష్‌యాదవ్, గ్రామ అధ్యక్షులు సుందర్‌గౌడ్, సంపత్, సి.రాజు, నర్సింగ్‌రావు, అబ్దుల్ సాదిక్, సదానంద, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానించిన రాచమల్ల సురేష్

మరోసారి గెలుపు ఖాయం..

శంషాబాద్: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మరోసారి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు రాచమల్ల సురేష్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన ఆయన శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భారీ మెజార్టీ కోసం యువజన విభాగం ఆధ్వర్యంలో సర్వశక్తులొడ్డుతామని చెప్పారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పాలనపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు.

సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయి



నార్సింగిలో ప్రచారం చేస్తున్న వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

మణికొండ: గత 9 ఏళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపిస్తాయని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌లు అన్నారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతివార్డు, కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌దేనని అభిప్రాయపడ్డారు. అలాంటి వ్యక్తిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్, కో - ఆప్షన్ సభ్యుడు మహామూద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు రాజ్ కుమార్, ముస్తాక్‌లతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి



మాట్లాడుతున్న పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్

శంషాబాద్: భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించేందుకు కృషి చేస్తామని శంషాబాద్ కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. శంషాబాద్ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్టానం ఖరారు చేసిన కస్తూరి నరేందర్ విజయానికి కాంగ్రెస్ పార్టీ నేతలు సమష్టిగా కృషి చేసేందుకు సన్నద్ధంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వైఫల్యమే ప్రధానాస్త్రంగా ప్రచారం చేస్తామన్నారు. శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, మైలారం సులోచన, కోటీశ్వర్‌గౌడ్, మహేందర్‌ముదిరాజ్, పరమేష్, శ్రీధర్‌యాదవ్, అక్రమ్, మహ్మద్‌గని, శంషుద్దీన్, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్, బొబ్బిలి శేఖర్, నర్సింగ్‌రావు, శేఖర్‌గుప్తా, గుంటి ప్రవీణ్, బండి అర్జున్‌యాదవ్, ప్రభాకర్‌యాదవ్, అంజయ్య, రవినాయక్ తదితరులున్నారు.

నరేందర్ ముదిరాజ్ విజయం ఖాయం..



కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: ప్రజల ఆకాంక్షను గౌరవించని పార్టీలను ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గౌరవించి అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన విషయాన్ని ప్రజల గుండెల్లో పదిలంగా దాచుకున్నారని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లుగా తెలంగాణ సంపదను దోచుకుని తినడమే కాకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి శిష్యుడిగా ప్రజల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌కు మంచి పేరు ఉందని, ఈ ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.